బీఆర్ఎస్ అభ్యర్థికి జననీరాజనం

ఒకటో వార్డులో ప్రచారం చేపట్టిన కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

కంటోన్మెంట్, ఏప్రిల్ 26 : కంటోన్మెంట్ ఉప ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ దూసుకుపోతుంది. ఉదయం, సాయంత్రం ఇంటింటి ప్రచారం చేపట్టడంతో పాటు మధ్యాహ్నం సమయంలో ముఖ్యనాయకులతో కార్యాచరణను రచిస్తున్నారు. మరోవైపు వార్డుల్లో ఆయా బోర్డు మాజీ సభ్యులు, సీనియర్ నాయకులు ఆయా బస్తీలు, కాలనీల్లో ప్రచారాన్ని వేగవంతం చేశారు. శుక్రవారం ఒకటో వార్డు పరిధిలోని సెవన్ టెంపుల్, చిట్టిరెడ్డి కాలనీ, చిన్నతోకట్ట, నక్కలపల్లి బస్తీల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు.

మీ బిడ్డగా మీ ముందుకు వస్తున్న..

స్థానికులతో మమేకమవుతూ మీ బిడ్డగా మీ ముందుకు వస్తున్న ఆశీర్వదించండి అంటూ ముందుకు సాగుతున్నారు. కంటోన్మెంట్ అభివృద్ధికి దివంగత ఎమ్మెల్యే సాయన్న చేసిన అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. గతంలో ఏ సర్కారు చేయని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కంటోన్మెంట్‌కు అన్ని పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ మాటలు వింటే మరోసారి గోసపడుతామని కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ గెలిస్తేనే అన్ని రంగాల్లో నియోజకవర్గం దూసుకెళ్తుందని చెప్పారు. ఈ సందర్భంగా జనమంతా నివేదితకు నీరాజనాలు పలికారు. జై బీఆర్ఎస్ అంటూ నినదించారు. అప్పటికీ, ఇప్పటికీ .. ఎప్పటికీ సాయన్న కుటుంబానికే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రచారంలో నాయకులు పద్మ, శ్రీనివాస్, రామకృష్ణ, బచన్ రాజు, నర్సింగ్, ఆరీఫ్, ఇక్బాల్, అంభికా, మేరీ, సబిత, భాగ్యమ్మ, సౌజన్య, ప్రవంతి పాల్గొన్నారు.

రెండోవార్డులో టీఎన్ శ్రీనివాస్ ప్రచారం

కంటోన్మెంట్ రెండో వార్డులోని అర్జున్‌నగర్, సీబీఎన్ నగర్ పోచమ్మ టెంపుల్ లైన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాయన్న సేవలను గుర్తు చేసుకుని ఆయన కూతురు నివేదితను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్, దేవుల పల్లి శ్రీనివాస్, జంగిలి రాజు, అంజనేయులు, జిలానీ, వాహెబ్ భాయ్, శ్రీనివాస్, కుమార్ గౌడ్, మహేశ్, నర్సింహా, ప్రకాశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ : బీదలబస్తీలో బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేస్తున్న నీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ

న్యూ బోయిన్‌పల్లిలో ర్యాలీలో పాల్గొన్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి

మూడోరోజూ.. పద్మారావుకు మద్దతుగా ప్రచారం

సికింద్రాబాద్, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ ఇంటింటి ప్రచారం చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పద్మారావు తరపున టీఆర్టీ క్వాటర్స్, బీదల బస్తీ ప్రాంతాల్లో నాయకులతో కలిసి పాదయాత్రగా వెళ్లి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటేసి పద్మారావు గౌడ్‌ని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ లో తెలంగాణ గళం, వాదాన్ని వినిపించాలంటే పద్మారావుగౌడ్‌ని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రజలకు చేసింది ఏమీలేదని.. మోసపూరితమైన హామీలిచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో శేఖర్, అశ్విన్, బాలాజీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతాం

ఓటు అభ్యర్థిస్తున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్, ఏప్రిల్ 26 : కాంగ్రెస్‌ను నమ్మితే మోసపోతామని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత విమర్శించారు. శుక్రవారం కంటోన్మెంట్‌లోని న్యూబోయిన్‌పల్లి ప్రాంతంలోని చిన్నతోకట్ట బస్తీల్లో ఎన్నికల ప్రచారంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. దివంగత సాయన్న చేసిన అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే తన తండ్రి, చెల్లిని కోల్పోయానని, ఇక మిగిలింది తనకు ప్రజాసేవ చేయడమే తన ముందున్న లక్ష్యమన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మాటిచ్చి మోసం చేశారని మండిపడ్డారు. ఓట్ల కోసం వచ్చే ఆ పార్టీ నేతలను నిలదీయాలని సూచించారు.

అర్జున్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్

సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ మెట్టుగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ రాసూరి సునీత, నియోజకవర్గ కార్పొరేటర్లు, పార్టీశ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. – అడ్డగుట్ట

న్యూ బోయిన్‌పల్లి చిన్నతోకట్టలో కరపత్రం అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

సెవన్ టెంపుల్‌లో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న నివేదిత

అడ్డగుట్ట : కార్పొరేటర్లు, నాయకులతో కలిసి ప్రచారంలో భాగంగా ప్రజలకు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్

రామానుజన్‌కు నివాళి

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్ర పటానికి పలువురు ప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు.

– చర్లపల్లి

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేస్తున్న ఏఆర్వోలు దశరథ్ సింగ్ రాథోడ్, నయీముద్దీన్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 26: పటిష్టమైన ప్రజాస్వామ్యం కోసం తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జూబ్లీ హిల్స్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్ రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం జూబ్లీ హిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓటరు స్లిప్ పంపిణీని ఖైరతాబాద్ తహసీల్దార్, ఏఆర్వో నయీముద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన యువత విధిగా ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. యూసుఫ్‌గూడ పోలీస్ బెటాలియన్‌లో ఓటర్లకు ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్‌లు పంపిణీ...

ఎర్రగడ్డ: రాజీవ్‌నగర్‌కాలనీ మహాలక్ష్మి ఎన్‌క్లేవ్‌లో ఓటరు స్లిప్‌ల పంపిణీని ఏఆర్వో, డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ ప్రారంభించారు. ఇంటింటికీ ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్‌లు, ఓటర్ గైడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వినయ్‌సాగర్, రాజీవ్‌నగర్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కృష్ణశర్మ, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బీఎల్వోలు వీరగిరి, చైతన్య పాల్గొన్నారు.


రాజీవ్‌నగర్‌లో ఓటర్లకు స్లిప్‌లు పంపిణీ చేస్తున్న డీసీ

నేడు బన్సీలాల్‌పేట్‌లో ఇంటింటి ప్రచారం

డివిజన్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ హేమలత లక్ష్మీపతి

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 26 : నేడు బన్సీలాల్‌పేట్‌లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ ఇంటింటి ప్రచారంలో పాల్గొంటారని కార్పొరేటర్ కే హేమలత తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు బోయిగూడలోని కేటీఆర్ పార్క్ వద్ద పార్టీ జెండా ఎగురవేసిన అనంతరం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి బోయిగూడ, బన్సీలాల్‌పేట్, మెట్లబావి, చాచానెహ్రూ నగర్, బీజేఆర్ నగర్ బస్తీల్లో ప్రజలను కలుస్తారని కార్పొరేటర్ తెలిపారు. గాంధీనగర్ కాలనీలో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలు హాజరై పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్, బీజేపీలకు ఓటమి తప్పదు

ఐదేండ్లు అభివృద్ధిని పట్టించుకోని బీజేపీకి ప్రజలు బుద్ధి చెబుతారని కార్పొరేటర్ హేమలత లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం బన్సీలాల్ పేట్ డివిజన్ బూత్‌స్థాయి ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పనులు జరిగాయని,, కేంద్రమంత్రిగా ఉండి ప్రజలకు దూరంగా ఉన్న కిషన్ రెడ్డికి ఓటమి తప్పదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని ప్రజలకు వివరిస్తామన్నారు. తమ డివిజన్‌లో బూత్‌స్థాయిలో బీఆర్ఎస్ పటిష్టంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే ఈసారి విజయం సాధిస్తామని తెలిపారు.

నాయకులంతా కలిసికట్టుగా పని చేయాలని దానం నాగేందర్ అన్నారు. క్రైస్తవ సంఘ నాయకులతో కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాసా కృపానందం శుక్రవారం దానం నాగేందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా దానం కాంగ్రెస్ గెలుపునకు తీసుకోవాల్సిన చర్యలను కృపానందంతో పాటు కాంగ్రెస్ నాయకులకు వివరించారు.

– అమీర్‌పేట్

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని అడ్డగుట్ట కాంగ్రెస్ నాయకులు మసీద్‌ల వద్ద ముస్లిం సోదరులను కలిసి కోరారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ సూచన మేరకు శుక్రవారం సమాజ్ తర్వాత ముస్లిం సోదరులను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంటా రాజుసాగర్, జాఫర్, యూసుఫ్, నాగభూషణం, సుదర్శన్, రమేశ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

– అడ్డగుట్ట

అడ్డగుట్ట : కార్పొరేటర్లు, నాయకులతో కలిసి ప్రచారంలో భాగంగా ప్రజలకు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్

ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

బేగంపేట్ డివిజన్ ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వ్యక్తిగత నిధులతో పునర్నిర్మించిన శ్రీ పోచమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే తలసాని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయాభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే తలసానికి ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి, నాయకులు శ్రీహరి పాల్గొన్నారు.

– బేగంపేట్

ఇష్వా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి శిబిరాలు

వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 26 : భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రాథమికోన్నత పాఠశాలలో ఇష్వా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. భరతనాట్యం, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, క్విజ్, ఫజిల్, ఫింగర్‌ప్రింట్స్, క్రీడలు, సంగీతంపై శిక్షణ ఇచ్చామని ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు హైమంతీపాల్ సక్కార్ తెలిపారు. మేకలమండి, నల్లగుట్ట, బోయిగూడలలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో శిబిరాలు ఏర్పాటు చేశామని, షేక్‌పేట్, గచ్చిబౌలి, బ్రాహ్మణపల్లి, తూప్రాన్‌లో విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. మొత్తం 16 కేంద్రాల్లో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి అకాడమిక్ చదువుతో పాటు శిక్షణ ఇస్తున్నామని, పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పాఠశాల హెచ్ఎం మల్లికార్జున్ రెడ్డి ఉచిత శిబిరం నిర్వహించిన ఫౌండేషన్ నిర్వాహకులు, వలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు.

అండర్-15 బ్యాడ్మింటన్ చాంపియన్ హంసిని

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 26: వేమూరి సుధాకర్ మెమోరియల్ బ్యాడ్మింటన్ టోర్నీలో చదరం హంసిని చాంపియన్‌గా నిలిచింది. మొయినాబాద్‌లోని జ్వాలాగుత్తా బ్యాడ్మింటన్ అకాడమీలో 23 నుంచి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ పోటీలు జరుగుతున్నాయి. అండర్- 13 కేటగిరిలో హంసినితో వృందా రమేశ్ వేముల పోటీ పడగా 21-13, 21-8 స్కోర్‌తో హంసిని విజేతగా నిలిచింది. అండర్-15 విభాగంలో చదరం హంసిని విజయలక్ష్మితో పోటీ పడి 21-13,21-13 స్కోర్‌తో ప్రత్యర్థిని చిత్తు చేసి టైటిల్ కైవసం చేసుకుంది. ముగింపు వేడుకల్లో ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ ఆరీఫ్ పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాయ న్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ కమిటీ సభ్యులు పీవీఎల్ కుమార్, జ్వాల గుత్తా అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.

చదరం హంసినికి బహుమతులు అందజేస్తున్న అకాడమీ చీఫ్ కోచ్ ఆరిఫ్

ఘట్‌కేసర్, పోచారంలో ముమ్మర ప్రచారం


ఘట్‌కేసర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 26 : మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలు, ఘట్‌కేసర్ మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఉదయం, సాయంత్రం వేళ్లలో కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. పోచారం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు మందాడి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సురేందర్‌రెడ్డి నగర్, నారపల్లి, తదితర కాలనీల్లో లక్ష్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కారుగుర్తుకు ఓటువేసి మరోసారి కేసీఆర్‌కు మద్దతు పలకాలని సురేందర్‌రెడ్డి కోరారు. ఘట్‌కేసర్‌లో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో లక్ష్మారెడ్డికి మద్దతుగా వార్డుల్లో జోరుగా ప్రచారం చేశారు. కౌన్సిలర్లు, నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యుడు ఎండీ సిరాజ్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కాచిగూడ, ఏప్రిల్ 26 : ప్రయాణికులను సురక్షితంగా చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమని బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం. వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు నేడు(శనివారం)మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు తెలియజేయాలంటే 9000406069 నంబర్‌కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌లోకి.. బీజేపీ నాయకులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 26 : సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ సమక్షంలో శుక్రవారం బీజేపీ అడ్డగుట్ట కంటెస్టెడ్ కార్పొరేటర్ మందా అశ్విని సురేశ్, పలువురు నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో సందీప్, నవీన్, గణేశ్, శివ, రవి, అనిత, సరితా, రమేశ్, పల్లవి, సుగుణ ఉన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE CUM FAMILY COURT JUDGE : MEDCHAL-MALKAJGIRI DIST AT : KUSHAIGUDA
FC OP NO. 24 OF 2023
Between:
Bollampalli Spandana
... Petitioner
AND
Panga Dayakar & another
... Respondents NO.1 & 2
To,
1. Panga Dayakar S/o. Panga Narsaiah Age: 39 years, Occ. Software Engineer,
2. Patulla Sreeveni W/o. Panga Dayakar Age: 35 years, Occ. House wife, Both are R/o: H NO. 10-3-32/9/69, 390, Nehru Nagar, East Maredpally, Secunderabad, Telangana.
Whereas the above named Petitioner has instituted a above case for seeking Divorce, as such you both are hereby directed to appear before the above court on 23-05-2024, at about 10:30 AM, in person or through Advocate or else case may be adjourned accordingly.
By the Order of the Court
Sd/- P.NAGRAJ GOUD
Advocate,
H.NO:17-1-386/1/S/42, SN REDDY NAGAR, CHAMPAPET, HYDERABAD-79.
PH.NO. 9394641333